క్లుప్తంగా

క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.20లక్షల నిధులు మంజూరు చేయడంతో మంగళవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి తండా నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్ననాయక్, వీరు, గణేష్, తదితరులు ఉన్నారు.

నాగేంద్రస్వామికి పూజలు



గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలిలో గల నాగేంద్రసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయాన్ని సిద్దిపేట సీపీ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు మంగళవారం సందర్శించారు. ఆలయ అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఎంపీటీసీ వీరారావు సీపీని శాలువాలతో సన్మానించారు.

పుస్తకాల పంపిణీ

దుగ్గొండి : మండలంలోని మందపల్లిలో యోగి వేమన జయంతిని పురస్కరించుకుని చిన్నారులకు త్రైత సిద్ధాంత ప్రభోత సేవాస మితి జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాష్ మంగళవారం వేమన శతకం పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నేటి కాలంలో మానవుడు నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఎన్నో ఆలోచనలతో సంపాదనే ధ్యేయంగా తృప్తి లేకుండా జీవిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల, పద్మ, త్రైత్రశ్రీ, రావణ్‌చారి, అక్షయ, రాజేశ్వరాచార్యులు, విక్రమ్, శశిరేఖ, రోహిణి పాల్గొన్నారు.

నూతన పీఆర్సీ ఇవ్వాలి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నూతన పీఆర్సీ విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నెక్కొండ శాఖ అధ్యక్షుడు గటిక మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి 2022, జూలై 2022 రెండు విడతల కరువు భత్యం, భృతిని విడుదల చేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కుడికాల సోమశేఖరం, మెట్టు నర్సింహారెడ్డి, వడ్డె లక్ష్మీనారాయణ, చిదురాల సత్యనారాయణ, పోగాకుల సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

30న 'అనాథల అరిగోస' దీక్ష



నినాదాలు చేస్తున్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్

నర్సంపేట : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో ఈనెల 30వ తేదీన అనాథల అరిగోస దీక్షను నిర్వహిస్తున్నట్లు సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో అనాథ పిల్లలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్ మాట్లాడుతూ దీక్షకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌కె.అక్బర్, రహీం, నిజాముద్దీన్, సంథాని, జాన్, యాకుబ్ మియా, రియాజ్, రెహమతుల్లా, రజాక్, జమాల్, సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న మదన్‌మోహన్‌రావు

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఏరుకొండ కరుణాకర్ తల్లి కమలమ్మ ఆరోగ్యం బాగాలేక పోవడంతో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు రూ. 22 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు నాగపురి రాజమౌళి, రామలింగం, రమేష్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్, పొగాకు దేవేందర్, గద్దం శివకుమార్, ప్రశాంత్, పవన్, స్వామి, రఘు, సీతారాములు, లింగన్న, దూడయ్య పాల్గొన్నారు.

నిర్మించి.. వదిలేశారు



అన్నారంలో నిర్మించిన గెస్ట్‌హౌస్

- అన్నారంలో అక్కరకు రాని గెస్ట్‌హౌస్

పర్వతగిరి : పేద ముస్లింలకు అన్ని హంగులతో అన్నారంలో గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. గెస్ట్‌హౌస్ నిర్మాణానికి లక్షల నిధులు వెచ్చించిన అది అక్కరకు రాకుండా పోతోంది. మండలంలోని ప్రముఖ యాత్ర స్థలమైన అన్నారం షరీఫ్‌లో పేద ముస్లింల పెళ్లిల్లు, వీవీఐపీలు, వీఐపీల కోసం 2010లో సుమారు రూ.50లక్షలతో గెస్ట్‌హౌస్ నిర్మించారు. కాగా నిర్వహణ సరిగ్గా లేక నేడు ఎవరికి ఉపయోగపడకుండా పోతోంది. దానిని ఆసరాగా తీసుకుని కొందరు ముస్లింలు అందులో లడ్డూల తయారీ వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయం వక్ఫ్‌బోర్డు అధికారులు, ఉన్నతాధికారులకు తెలిసిన పట్టించుకోక పోవడం విడ్డూరంగా ఉంది. వీవీఐపీలు, వీఐపీల కోసం మొదటి అంతస్తులో సుమారు 8గదులు ఏర్పాటు చేయగా వాటికి మరుగుదొడ్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. అదే విధంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో పేద ముస్లింల పెళ్లిళ్లు, ఫంక్షన్లు, కందూర్లకు ఇవ్వాల్సిన ఉండగా లడ్డూల తయారీ కోసం ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి గెస్ట్‌హౌస్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

స్వాధీనం చేసుకుంటాం



ప్రభుత్వం నిర్మించిన షాదీఖానా, గెస్ట్‌హౌస్‌ను త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. అందులో కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ఉండడం, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉండడం కూడా ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దానిని స్వాధీనం చేసుకుంటాం.

– రియాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

నిరుపయోగంగా షాదీఖానా



పేద ముస్లింల కోసం ఏర్పాటు చేసిన షాదీఖానా నిరుపయోగంగా మారింది. దీంతో ప్రభుత్వం లక్ష్యాన్ని నీరు గార్చారు. పది సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తులు వాడుకుంటున్నారు. వారి వద్ద నుంచి రుసుం వసూలు చేయాలి. పేద ముస్లింల పెళ్లిల్లకు తక్షణమే షాదీఖానా అనుమతి ఇచ్చే విధంగా వక్ఫ్‌బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలి.

– బండి సతీష్, రావూరు

చిరుధాన్యాలను సాగు చేసుకోవాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న ఏడీఏ, రైతులు

చెన్నారావుపేట : రైతులు చిరుధాన్యాలను సాగు చేయాలని నర్సంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు అవినాష్ వర్మ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సంవత్సరం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలు నీటి వసతి తక్కువ ఉన్న నేలలో పెరుగుతాయని అన్నారు. సజ్జలు, కొర్రలు, పచ్చ జొన్నలు, సామలు, అరికెలు వీటితో పలు రకాల తినుబండారాలు తయారుచేసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫి, వ్యవసాయ అధికారి కర్పూరపు అనిల్‌కుమార్, సర్పంచ్ స్వామి, జిల్లా ఆర్‌బీఎస్ సభ్యురాలు టేకుల స్వరూప, బాలు సింగ్, ఏఈఓ స్మిత, సంపత్, రఘుపతి, వినయ్,రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



పర్వతగిరి : షూటింగ్ బాల్ క్రీడల్లో ఏషియన్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూరుకు చెందిన బొల్లు పవన్, మంగళంపల్లి మధు, దొనికె జాహ్నవి, మందుల ఉమలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందించారు. ఈ మేరకు పర్వతగిరిలోని మంత్రి నివాసంలో జెడ్పీటీసీ శ్రీనివాస్, షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెడుపల్లి ఐయిలయ్య ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచి తెలంగాణ రాష్ట్రం, పాలకుర్తి పేరు నిలబెట్టాలని మంత్రి ఆకాంక్షించారు.

ఉపేందర్ మృతి బాధాకరం..

రాయపర్తి : రాయపర్తి పీఏసీఎస్ డైరెక్టర్ మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఏదుల ఉపేందర్ మృతి బాధాకరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అనారోగ్యానికి గురై మృతిచెందిన ఉపేందర్ మృతదేహానికి మంగళవారం మంత్రి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మూనావత్ నర్సింహానాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం



నర్సంపేట: శిక్షణ ఇస్తున్న సాంబయ్యగౌడ్



రాయపర్తి: తిర్మలాయపల్లి కరాటే శిక్షణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు



నల్లబెల్లి: మాట్లాడుతున్న నానబోయిన రాజారాం

నర్సంపేట : మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం, మానసిక ధైర్యం, శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తుందని నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్, సీనియర్ నేషనల్ కరాటే చాంపియన్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని జెడ్పీఎస్ఎస్(బొందబడి)లో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 30రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా కరాటే శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, సాంబయ్యగౌడ్‌లు మాట్లాడుతూ మహిళల్లో మానసిక స్థైర్యాన్ని నింపడానికి, వ్యక్తిగత రక్షణ, క్రమశిక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

సంగెం : కరాటే బాలికలకు ఆత్మరక్షణకు దోహదం చేస్తుందని ఎంపీపీ కళావతి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేజీబీవీలో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటే ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవచ్చుననే ఆత్మవిశ్వాసం విద్యార్థినులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, ప్రత్యేకాధికారిణి నీలిమ, కరాటే శిక్షకుడు నిమ్మనబోయిన శ్రీనివాస్, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : బాలికల్లో కరాటే ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని సర్పంచ్ నానబోయిన రాజారాం అన్నారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో మంగళవారం కరాటే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ బాలికల్లో భయాన్ని పోగొట్టి, విపత్కర పరిస్థితుల్లో ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ సునీత, కరాటే కోచ్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటే అవసరం

రాయపర్తి : ఆత్మరక్షణకోసం బాలికలకు కరాటే అవసరమని ప్రతీ ఒక్కరు కరాటేలో శిక్షణ పొందాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లి కస్తూరిబా బాలికల వసతిగృహంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కరాటే శిక్షణ శిబిరంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గజవెల్లి అనంతప్రసాద్, ఎస్‌ఓ బుర్ర కవిత, కరాటే మాస్టర్ చిన్నాల కుమారస్వామి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



చెన్నారావుపేట : మంచు దుప్పటి కప్పేసింది. మంగళవారం దట్టమైన పొగమంచు ఉదయం నుంచి 9గంటల వరకు పొగమంచు కప్పేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డుపై వెళ్తున్న వ్యక్తులు కనిపించకపోవడం ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందారు. ఓ వైపు కశ్మీరును తలపించేలా మంచు కురవడంతో వాహనదారులు, ప్రజలు మురిసిపోయారు.

పండిట్‌లకు పదోన్నతి కల్పించాలి



దుగ్గొండి: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహ్మదాపురం పాఠశాల ఉపాధ్యాయులు



గీసుకొండ: కొమ్మాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. భాషా పండితుల నిరసన

దుగ్గొండి : భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించాలని భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మహ్మదాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండితులకు, పీఈటీలకు పదోన్నతి కల్పించకుంటే 9, 10 తరగతుల బోధనతో పాటు పేపరు మూల్యాంకనం నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు.

గీసుకొండ : మండలంలోని కొమ్మాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో భాషా పండితులకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. భాషా పండిత సంఘాల రాష్ట్ర ఐకాసా పిలుపు మేరకు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు కుమారస్వామి, హిందీ ఉపాధ్యాయిని దుంపటి లలితారాణితో పాటు పలువురు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. భాషా పండితులకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని వారు కోరారు.

బాలికలపై కొనసాగుతున్న వివక్ష



నర్సంపేట: మాట్లాడుతున్న బెజ్జంకి ప్రభాకర్



దుగ్గొండి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

నర్సంపేట : సమాజంలో ఆడపిల్లలు వివక్షత, నిర్లక్ష్యం, లైంగిక వేధింపులకు గురవుతున్నారని స్వయంకృషి సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ ఆడ పిల్లల రక్షణకు సమాజంలోని ప్రతీ ఒక్కరు మానవతా దృక్పథంతో కృషి చేయాలని కోరారు. బాలికలు సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆడ పిల్లలకు ఎలాంటి ఆపద, సమస్యలు ఎదురైనా ధైర్యంగా వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100 హెల్ప్‌లైన్‌లకు ఉచిత కాల్ ద్వారా సమాచారం అందించి సహాయం తీసుకుని రక్షణ పొందాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మాధవి మాట్లాడుతూ నేటి ఆడ పిల్లలే రేపటి అమ్మలు, నేటి ఆడ పిల్లలను వద్దనుకుంటే రేపటి సమాజమే అమ్మ లేని అనాథ అవుతుందని తెలిపారు. బాలికలు ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడానికి కరాటే మాస్టర్ రచ్చ శ్రీనుబాబు కరాటే మెలకువలు ప్రదర్శించి చూపించారు. పదో తరగతి బాలికలకు ఆన్ ఇన్ వన్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, ఉపాధ్యాయులు రూపారాణి, రాజేష్, వాణి, రాధిక, అరుణ, సుజాత, విజయలక్ష్మి, పద్మ, నరేందర్, సురేష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రావు, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనుబాబు, బాలికలు పాల్గొన్నారు.

బాలికల ర్యాలీ

దుగ్గొండి : జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లను పుట్టనిద్దాం- బతకనిద్దాం అనే నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, సుమలత, శ్రీను, మాధవి, సుధీర్ కుమార్, కరంచంద్, వెంకట్రావ్, సంధ్యారాణి, నాగరాజు, ప్రదీప్, అనురాధ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నర్సంపేట : తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళిధర్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మిథున్‌గౌడ్, సృజనరెడ్డి, సిద్దార్థ విద్యా సంస్థల డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉన్న మానసిక రుగ్మతలను పారద్రోలాలంటే సైకాలజిస్టోస్ అవసరమన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, నల్ల భారతి, పెండెం రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తి శివారులో ఆకేరు వాగు ఒడ్డున ముగ్గురు రైతులు విద్యుత్ మోటర్ల ద్వారా ఇసుక ఫిల్టర్ చేస్తున్నట్లు సమాచారం అందిందని విద్యుత్ విజిలెన్స్ ఏడీఈ నటరాజ్ తెలిపారు. దీంతో ఆకస్మిక దాడులు నిర్వహించగా అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్‌ను గుర్తించడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నట్లు ఏడీఈ నటరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ వ్యవసాయానికి మాత్రమేనని అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను సర్పంచ్ ఉప్పరి లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈజీఎస్, మన ఊరు–మన బడి అభివృద్ధి పనుల్లో భాగంగా మరుగుదొడ్లు, ప్రహరీ పనులు ప్రారంభించమన్నారు.


ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన




వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వర్ధన్నపేట : ఓటు హక్కు వజ్రాయుధమని యువత ఓటు ప్రాధాన్యతను తెలుసుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని భారతి కళాశాలల చైర్మన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్నుపురెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు హక్కు ప్రాధాన్యత -యువత పాత్ర వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఓటును నోటుకు అమ్ముకోకుండా సరైన నాయకుడిని ఎన్నుకోవడంలో యువత కృషి చేసి ప్రజల్లో చైతన్యాన్ని నింపాలన్నారు. 18 సంవత్సరాలు కలిగిన యువతి యువకులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కనకచారి, గుంశావలీ, వెంకన్న, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఘనంగా భక్తమార్కండేయ జయంతి



నర్సంపేట: మార్కండేయ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంఘం బాధ్యులు



నల్లబెల్లిలో..



గీసుకొండ: ధర్మారంలో..

నర్సంపేట : పట్టణంలోని పద్మశాలీ సంఘం కార్యాలయంలో భక్త మార్కండేయ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించగా ముఖ్య అతిథిగా పట్టణ గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం పాల్గొని భక్త మార్కండేయ చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో కోదాటి మోహనకృష్ణ, బాల్నె బాల్‌లింగం, వెల్దండి వెంకటేశ్వర్లు, కామణి రవీందర్, వెంగళ సదానందం, పెండెం వెంకటేశ్వర్లు, పర్శ శ్రీధర్, వెల్దండి స్వరూప, కోదాటి అనిత, సబ్బని రాజమౌళి, కిరణ్, రాము, రమేష్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : సద్గుణుడు మార్కండేయ జయంతిని పద్మశాలీ పరపతి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నారక్కపేట గ్రామంలో మంగళవారం నిర్వహించారు. మార్కండేయ చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు కోడూరు లక్ష్మయ్య పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వక్కల చంద్రమౌళి, రమేష్, రంజిత్, రాజ్‌కుమార్, కుమారస్వామి, శ్రీను, శ్రీకాంత్, మోహన్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. పద్మశాలీలు కుటుంబ సమేతంగా తరలివచ్చి పూజలు చేశారు. పద్మశాలీ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు ఎలిగేటి కిష్టయ్య, కుల పెద్దలు రామా వెంకట్‌నారాయణ, సంతోష్, ఎలిగేటి వీరస్వామి, కోటి, ప్రసాద్, మల్లయ్య, చందనాల రాము పాల్గొన్నారు. వారితో పాటు టీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, గోలి రాజయ్య, కొమ్ముల కిషోర్, గంగుల విశ్వేశ్వర్, రాజు, కొట్టె ముత్తిలింగంలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందించడంలో విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నల్లబెల్లి : వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు గట్టి కృష్ణ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కొండాపూర్ శివారు మురళినగర్‌లో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో నిరంతరం కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. రోజుకు కనీసం ఆరుగంటల ఉచిత విద్యుత్ రైతులకు అందడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకలు మాచర్ల శ్రీధర్, సిగం స్వామి, విజయ్, రమేష్, ప్రదీప్, యాకన్న, నాగరాజు, మల్లయ్య, వైకుంఠం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

వర్ధన్నపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలింబిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజలకు మేలు చేస్తుందని పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రామవరం, బండౌతపురం, దివిటిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టత పరిచి గత వైభవాన్ని చాటి చెప్పాలన్నారు. రామవరం గ్రామంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎండీ అప్సర్, కర్ర మాలతిరెడ్డి, కొండేటి బాలకృష్ణ, మల్లెపాక సమ్మయ్య, తాళ్లపెల్లి శ్రీనివాస్, సోమలక్ష్మి, జలీల్, స్వరూప, కుమరస్వామి, సుదర్శన్, అనిల్‌కుమార్, సోమిరెడ్డి, పుట్ట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.